క్లుప్తంగా

ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

హన్మకొండ అర్బన్ : నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద సోమవారం ఉదయం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. వరంగల్ జిల్లా రామన్నకుంట తండాకు చెందిన నిఖిల్ (7)కు ఆదివారం యాక్సిడెంట్ కాగా కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే చికిత్స చేస్తున్నామని నమ్మించి బాలుడిని చంపేశారని బంధువులు ఆరోపిస్తే హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు.

దివ్యాంగుల కోఆర్డినేషన్ సభ్యుడిగా మహేందర్



విద్యారణ్యపురి: దివ్యాంగుల జిల్లా కోఆర్డినేషన్ సభ్యుడిగా హనుమకొండకు చెందిన బిల్ల మహేందర్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తాము నిర్దేశించే విధులను నిర్వర్తించేందుకు వైకల్యంపై జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తుంది. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా ఉంటారు. కమిటీలో వివిధ కేటగిరీలో అనుభవజ్ఞులైన దివ్యాంగ ప్రతినిధులు ఉంటారు. ప్రతి మూడు నెలలకోసారి కలెక్టర్ అధ్యక్షతన దివ్యాంగుల సమస్యలపై చర్చిస్తుంది.

బెస్ట్ ఫైటర్లుగా కృషిత, శివాత్మిక



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జక్రియా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో అండర్–14, 17 బాలికల విభాగాల్లో ప్రతిభ కనబరిచి ఆర్ కృషిత, సీహెచ్.శివాత్మిక బెస్ట్ ఫైటర్ అవార్డులను అందుకున్నారు. బీఎంఆర్ కరాటే డు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మూడు రాష్ట్రాల నుంచి 400 మంది హాజరు కాగా వరంగల్‌కు చెందిన ఇద్దరు బాలికలు బెస్ట్ ఫైటర్లుగా నిలవడం అభినందనీయమని అకాడమీ చైర్మన్ బండారి సంతోష్ తెలిపారు. అండర్–19 బాలుర విభాగంలో భరత్ గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గణేష్, పి.దినేష్, సలహాదారుడు కె వెంకటేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నియామకం

నయీంనగర్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గంలోకి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పలువురిని నియమించారు. అడ్వైజర్‌లు బాల్నె సర్వేశం, అధికార ప్రతినిధులు కందగట్ల నరహరి, నామాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రుద్ర ఓంప్రకాశ్, పెద్దూరి సంజీవరావు, రాష్ట్ర కార్యదర్శులు కూచన శ్రీనివాస్, మర్త సారంగపాణి, సంయుక్త కార్యదర్శి గడ్డం రాజేందర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

మామునూరు: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం (టీఎంఎఫ్) వరంగల్ జిల్లా అధ్యక్షుడు మిత్తింటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన గణితశాస్త్ర టాలెంట్ పరీక్షలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో టీఎంఎఫ్ ప్రధాన కార్యదర్శి గుండు వేణు, లావణ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కుమారస్వామి, ఉపేందర్, మండల గణితశాస్త్ర ఉపాధ్యాయులు, 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు

స్ఫూర్తికి డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో పరిశోధకురాలు పి.స్ఫూర్తికి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్ ఇన్ కమర్షియల్ బ్యాంక్స్– ఏ స్టడీ ఆఫ్ సెలక్టెడ్ బ్యాంక్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి స్ఫూర్తికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు జీ.వీ భవానిప్రసాద్ పర్యవేక్షణలో స్ఫూర్తి తన పీహెచ్‌డీని పూర్తి చేసింది.

విజయవంతం చేయాలి

కాజీపేట: మండలంలోని సోమిడిలో సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్యతో కలిసి ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు.

వాహనాలకు అడ్డాగా బల్దియా కార్యాలయం

- వారం రోజులుగా ఇసుక ట్రాక్టర్లు ఇక్కడే
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కార్యాలయం ఆవరణలో ఇసుక ట్రాక్టర్ల పార్కింగ్



రోజుల తరబడి పార్కింగ్ చేస్తున్న ప్రైవేట్ కార్లు

వరంగల్ అర్బన్ : వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రోజుల తరబడి ఆవరణలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులున్నా వాహనాలను ఇష్టమొచ్చినట్లు పార్కింగ్ చేస్తున్నారు. బల్దియా ప్రధాన కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. దీంతో బల్దియా ఆవరణం ఆఫీస్ వేళల్లో వాహనాలతో రద్దీగా ఉంటుంది. వారం కిందట మట్టెవాడ పోలీసులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారంటూ నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశారు. ఇసుక ట్రాక్టర్లను బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో పార్కింగ్ చేసి వదిలేశారు. ఇవేకాకుండా ప్రైవేట్ కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు పగలు, రాత్రి తేడా లేకుండా ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. అనుమతి లేని వాహనాల పార్కింగ్‌పై పనుల కోసం వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఆశా యూనియన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు కాను మాధవి



డీఎంహెచ్‌ఓ వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

ఎంజీఎం : పెండింగ్‌లో ఉన్న మూడేళ్ల ఆశా వర్కర్లకు లెప్రసీ, టీబీ, పల్స్ పోలియో, ఎన్సీడీ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆశా యూనియన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు కాసు మాధవి, సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ అధ్వర్యంలో సోమవారం హనుమకొండ డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ అప్పయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వం ఈనెల 2 నుంచి 15 వరకు నిర్దేశించిన లెప్రసీ సర్వే చేసేది లేదని తేల్చారు. ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 3న అన్ని పీహెచ్‌సీల ముందు ధర్నా, 4న జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి బకాయిల విషయం తీసుకెళ్తానని, మిగతా సమస్యల కోసం కూడా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కల్పన, రజిత, గంగ, జమున, శ్రీవాణి, నవమని, సంధ్య, రమ, కవిత, శోభ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

హసన్‌పర్తి: స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు సాయంత్రం ఫ్రూట్స్ అందించడానికి లయన్స్‌క్లబ్ ముందుకు వచ్చినట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. లయన్స్‌క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నెలరోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కృపాకర్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ ముందు వరుసలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కుమారస్వామి, కోశాధికారి బి.శంకర్, జిల్లా సమన్వయ కర్త డాక్టర్ అజిత్‌కుమార్, హెచ్‌ఎం సుమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్ర రిపోర్టు ఇవ్వాలి



విశ్వేశ్వరావుకి వినతిపత్రం అందజేస్తున్న సంఘాల నాయకులు

న్యూశాయంపేట : విద్యాకమిషన్ పాఠశాలలను, గురుకులాలను నామమాత్రపు సర్వే చేస్తే సరిపోదని సమగ్ర రిపోర్ట్ తయారు చేసి ప్రభుత్వానికి అందించి ఒత్తిడి తేవాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి హకీం నవీద్ డిమాండ్ చేశారు. ఇటీవల వరంగల్‌కు విచ్చేసిన కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అందించారు. కమిషన్ విచారణ జరిపే ముందు సమాచారం ఇచ్చి వెళ్లకుండా ఆకస్మికంగా తనిఖీలు చేపడితే గ్రౌండ్‌లెవల్‌లో సమస్యలు తెలుస్తాయన్నారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన అధికారులను గుర్తించి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాజేష్‌నాయక్, వంశీకృష్ణ, మోహన్‌నాయక్, రాకేశ్, చందు పాల్గొన్నారు.

శివాలయంలో రుద్రాభిషేకం

వరంగల్: వరంగల్ కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం మహాన్యాస పూర్వ ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం యాగశాలలో మూడు హోమ గుండాల్లో చండీహవనం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భక్తులు కొమురయ్య, వైకుంఠం, కృష్ణమూర్తి, రాజు, రమేష్, ఉప్పుల రవి, బండారి భాస్కర్, బోగి రమేష్, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వంలో కార్మికులకు అన్యాయం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్



మాట్లాడుతున్న సీఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ. యూసుఫ్

ఖిలా వరంగల్: ప్రధాని మోదీ ప్రభుత్వంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, యాజమాన్యాల అనుకూలత కోసం రద్దు చేసిన 44 కార్మికుల హక్కులను తిరిగి పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్ కోరారు. సోమవారం శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ అధ్యక్షతన ఏఐటీయూసీ శిక్షణ తరగతులు జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్‌మియా, ఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు పనాస ప్రసాద్‌లతో కలిసి జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కాంట్రాక్ట్ లేబర్ విధానాలు రద్దు చేసి పనిచేసే వారిని పరిమితి ఉద్యోగులుగా గుర్తించాలని, స్కీం వర్కర్‌గా పనిచేస్తున్న ఆశ, అంగన్వాడి మధ్యాహ్నం భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సంఘటిత కార్మిక సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రతినిధులు కందిక చెన్నకేశవులు, దండు లక్ష్మణ్, గుంపల్లి మునీశ్వరుడు, ఎండి ఖాసీం, తాళ్లపల్లి జాన్‌పాల్, దామెర కృష్ణ, అక్బర్‌పాషా, బొట్ల శ్రీను పాల్గొన్నారు.

దశాబ్దాల పోరాటాల ఫలితమే కోచ్ ఫ్యాక్టరీ

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట : భారత కమ్యూనిస్టు పార్టీ దశాబ్దాలుగా చేసిన పోరాటాల ఫలితమే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యమైందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాటి నాయకులు మడత కాళిదాస్, బీఆర్ భగవాన్‌దాస్ నాయకత్వంలో ఉధృత పోరాటాలు సాగాయన్నారు. స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నేదునూరి జ్యోతి, తోట భిక్షపతి, ఎల్లేశ్, సారంగపాణి, రవి, సదానందం, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన వీఆర్ఏలకు ఉద్యోగాలు ఇవ్వాలి



కలెక్టరేట్‌లో నిరసన చేపడుతున్న నాయకులు

హన్మకొండ అర్బన్ : 2023 జూలై, ఆగస్టు నెలల్లో జీఓ నం.81, 85లను అనుసరించి 20,555 మంది వీఆర్ఏల్లో 61 ఏళ్లలోపు వయస్సు కలిగిన 16,758 మంది వీఆర్ఏలకు ప్రమోషన్ ఇచ్చింది. ఆ జీఓలో మిగిలిన 61 సంవత్సరాల వయస్సు పైబడిన 3,797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, వీరికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్ఏ జేఏసీ జిల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం జేఏసీ నాయకులు హనుమకొండ కలెక్టరేట్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన చేపడుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వడం వలన రెవెన్యూ వ్యవస్థ బలపడతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ జిల్లా నాయకులు నగేష్‌కుమార్, రమేష్, మధు, సాగర్, రమేష్ పటేల్, ఆంజనేయులు, శివ, భరత్, అనిల్, శ్రీశైలం, నాగేశ్వర్‌రావు, వెంకటేష్, రామ్‌సాగర్, శ్రీకాంత్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వాహనదారుడిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: రోడ్డు క్రాస్ చేస్తున్న ఓ వృద్ధుడిని బైక్‌తో ఢీకొట్టిన వాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం తెలిపారు. కరీమాబాద్‌కు చెందిన తాటిపల్లి కుమారస్వామి గత నెల 26న సాయంత్రం ఇంటి ముందు రోడ్డు దాటుతుండగా ఉర్సుగుట్ట ప్రాంతానికి చెందిన సాదుల రాజు బైక్ వచ్చి అతివేగంగా ఢీకొట్టాడు. సందీప్‌కుమార్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

కారు డ్రైవర్‌పై..

బైక్‌ను ఢీకొట్టి తీవ్రగాయాలకు కారకుడైన కారుడ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. వరంగల్ శంభునిపేటకు చెందిన లావుడ్య రాజు, గుగులోతు రాజు ఇద్దరు కలిసి వ్యక్తిగత పనిమీద బయటకు వెళ్లి తిరిగి ఆదివారం సాయంత్రం బైక్‌పై ఇంటికి వస్తున్నారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఖమ్మం రోడ్డుపై కారు డ్రైవర్ భిక్షపతి కారు అదుపు తప్పి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికీ గాయాలయ్యాయి. రాజేష్ ఫిర్యాదు మేరకు సోమవారం కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మడికొండ: కాజీపేట మండలం మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని ఖండాల దాబా హోటల్ ఎదురుగా ఉన్న ఫోర్ట్ వరంగల్ ప్రాంతానికి చెందిన బండి రాజు గత కొంత కాలంగా కాకతీయ గ్రామీణ బ్యాంకు వెనకాల అద్దెకు ఉంటున్నాడు. అక్కడ ఉంటూ రేషన్ బియ్యం రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోమవారం ఉదయం తనిఖీ చేయగా 4 క్వింటాళ్ల బియ్యం లభించినట్లు స్థానిక సీఐ పుల్యాల కిషన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అయ్యప్ప దేవాలయంలో చోరీకి యత్నం

వరంగల్: కాశిబుగ్గ ఓ సిటీ సమీపంలోని సీతా రామాంజనేయస్వామి ఆలయంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడినట్లు సీసీ ఫుటేజీలో గుర్తించిన ఆలయ నిర్వాహకులు ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇప్పటి వరకు ఈ ఆలయంలో నాలుగుసార్లు దొంగతనం చేసి హుండీని పగులకొట్టి అందులోని డబ్బులు అపహరించారు. సీసీ ఫుటేజీలోని వ్యక్తి తాళం పగులకొట్టేందుకు ప్రయత్నించగా వీలు కాకపోవడంతో వెళ్లిపోయినట్లు గుర్తించారు.

మొబైల్ చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ఖిలా వరంగల్: రైల్వే ప్రయాణికుడి మొబైల్ చోరీ చేసిన కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ పి.సురేందర్ తెలిపారు. ఓ ప్రయాణికుడి నుంచి రూ.15వేల విలువ చేసే మొబైల్ ఫోన్‌ను చోరీ చేసినట్లు నిందితుడు శైలేష్ శుక్ల ఒప్పుకున్నాడు.

గీత కార్మికుడిని ఆదుకోవాలి

హసన్‌పర్తి : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గాయపడిన పలివేల్పులకు చెందిన రాజు కుటుంబాన్ని ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు. ప్రస్తుతం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజును గౌడ సంఘం నాయకులు పరామర్శించారు.

ఓ ప్రైవేట్ స్కూల్ అత్యుత్సాహం

కాజీపేట అర్బన్ : హంటర్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం సోమవారం అయ్యప్ప మాలధారణతో పాఠశాలకు హాజరైన విద్యార్థిపై అత్యుత్సాహంతో పాఠశాల యూనిఫాం వేయించిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. 7వ తరగతి చదువుతున్న విద్యార్థి సోమవారం యథావిధిగా పాఠశాలకు రాగా యాజమాన్యం యూనిఫాం ఉంటే ప్రవేశించాలని గంట పాటు బయట నిలబెట్టారు. సుమారు రెండు గంటల పాటు పాఠశాల ఆవరణలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకోగా పోలీసులు ఘటన విషయాన్ని తెలుసుకుని పాఠశాలకు చేరుకుని గొడవను సద్దుమణిగించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప భక్తి సేవాశ్రమ వ్యవస్థాపకులు టీఆర్.బాలసుబ్రహ్మణ్య తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కాజీపేట: ట్రాఫిక్ నిబంధనలు పాటించి విలువైన ప్రాణాలను దక్కించుకోవాలని కోరుతూ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కడిపికొండ చైతన్య పాఠశాల హెచ్‌ఎం అనిత ఆధ్వర్యంలో సోమవారం వందమంది విద్యార్థులు రహదారులపై జరుగుతున్న ప్రమాదాల ఫ్లెక్సీలతో పురవీధుల్లో ర్యాలీ తీశారు.

కెమిస్ట్రీ విభాగాధిపతిగా వాసుదేవరెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం అధిపతిగా ఆ విభాగం ప్రొఫెసర్ ఎన్. వాసుదేవరెడ్డిని నియమిస్తూ సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సవితాజ్యోత్స్న విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె పదవీ కాలం ముగియటంతో వాసుదేవరెడ్డిని నియమించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కేయూ క్యాంపస్: ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాని కేయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మీ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్, స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది సహకారంతో శిబిరం నిర్వహించారు. డాక్టర్ చార్లీనా మాట్లాడుతూ వ్యాయామం తప్పనిసరి అన్నారు.

'సుమతిరెడ్డి'లో ఉచిత దంత వైద్యశిబిరం

హసన్‌పర్తి: నగర శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. కళాశాల స్టూడెంట్స్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల కొత్తకొత్త రకాలైన వ్యాధులు వ్యాపిస్తున్నాయని చెప్పారు.

మానవ అక్రమ రవాణా నేరం

రామన్నపేట : మానవ అక్రమ రవాణా నేరమని, అనైతిక చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మానవ అక్రమ రవాణా విభాగం ఇన్‌స్పెక్టర్ వెంకన్న హెచ్చరించారు. దేశాయిపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదుస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ సుమతి వసుధ హాజరై మాట్లాడారు.

రాజనీతిశాస్త్ర విభాగం సందర్శన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం పూర్వ విద్యార్థి ఏసీపీ జితేందర్‌రెడ్డి సోమవారం ఆ విభాగాన్ని సందర్శించారు. ఆ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, అధ్యాపకులతో కొంతసేపు ముచ్చటించారు. ఆ విభాగంలో నూతనంగా అలుమ్ని సెమినార్ హాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హాల్‌ను ఏసీపీ జితేందర్‌రెడ్డి పరిశీలించి ఈ హాల్‌కు ఒక ఏసీని డొనేట్ చేస్తానని హామీ ఇచ్చినట్లు డాక్టర్ వెంకట్ తెలిపారు.

పూరిగుడిసె దగ్ధం

హసన్‌పర్తి: మండలంలోని పెంబర్తిలో ప్రమాదవశాత్తు ఓ పూరి గుడిసె దగ్ధం కాగా ఇంట్లో ఉన్న నగదుతో పాటు సామగ్రి కాలి బూడిదయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై సిద్దయ్య, ఆర్ఐ ఫాజిల్, మాజీ ఎంపీటీసీ కుమారస్వామి, మాజీ సర్పంచ్ జోరుక పూల, చాత వేణుగోపాల్ సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధిత సూర గంగాధర్ కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నేత వేణుగోపాల్ డిమాండ్ చేశారు.

బాలజ్యోతి స్కూల్‌లో మాక్‌పోలింగ్

వరంగల్: కాశిబుగ్గ 19వ డివిజన్ వివేకానందకాలనీలోని బాలజ్యోతి ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 'ప్రజాస్వామిక పద్ధతిన ఎన్నికల విధానం' అనే అంశంపై మాక్ పోలింగ్ నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పొన్నోజు చక్రపాణి తెలిపారు. ఈ ఎన్నికల్లో పదో తరగతి విద్యార్థులు రామోజు రక్షిత, సాంబారి అనురూప్, మారోజు వంశీకృష్ణలు వివిధ గుర్తులతో పోటీ చేయగా విద్యార్థులు పోలింగ్‌లో పాల్గొని ఓట్లు వేశారు.

కాలభైరవుడికి అభిషేకం

దేశాయిపేట: దేశాయిపేటలోని కైలాసగిరి ప్రాంగణంలోని కాలభైరవుడికి ఓరుగల్లు భారత్ వికాస్ పరిషత్ హనుమకొండ శాఖ అధ్వర్యంలో ఆదివారం రాత్రి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో 25 కుటుంబాలకు చెందిన 75 మంది భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు బీవీపీ సభ్యులకు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో బీవీపీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ సుధీర్‌కుమార్, సత్యనారాయణ, అగర్వాల్, గోవిందరాజులు, రామారావు, సంతోష్‌రెడ్డి, వివేకానంద్, జయపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

వాస్తవికతను మరచి మాట్లాడుతున్న కాంగ్రెస్

కాజీపేట : ఉద్యమాలే ఊపిరిగా జీవిస్తూ రైల్వేకోచ్ ఫ్యాక్టరీ సాధనలో కీలక పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌పై కాంగ్రెస్ నాయకులు వాస్తవికతను మరచి విమర్శలు చేయడం అర్థరహితమని కార్పొరేటర్ సంకు నర్సింగ్ విమర్శించారు. కాజీపేటలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

శ్రీకీర్తికి నృత్య విభూషణ్ అవార్డు

నయీంనగర్: వరంగల్ ప్రసిద్ధ నాట్య కళాకారిణి మల్లం శ్రీకీర్తికి నృత్య విభూషణ్ అవార్డు, కూచిపూడి సోలో కేటగిరిలో ప్రథమస్థానం పొందింది. అఖిల్ నట్రజం ఆంటర్ సాంస్కృతిక్ సంఘ్ (అనాస్ ఇండియా) ఇంటర్నేషనల్ డాన్స్ కౌన్సిల్ సీఐడీ, పారిస్–ఫ్రాన్స్ ఆధ్వర్యంలో నవంబర్ 30న హైదరాబాద్ విద్యాభవన్‌లో ఆలిండియా 15వ సాంస్కృతిక జాతీయ నృత్య పోటీ, ఉత్సవంలో ఆమెకు అవార్డు ప్రదానం చేశారు. కీర్తి శివాని హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది.

ప్రశ్నించే గొంతును అణచివేస్తున్న కాంగ్రెస్

కాజీపేట అర్బన్ : ప్రశ్నించే గొంతును కాంగ్రెస్ అణచి వేస్తుందని బీఆర్ఎస్ పార్టీ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సోమవారం గురుకులాల బాట చేపట్టిన బీఆర్ఎస్వీ విద్యార్థులను అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్ తరలించడం ఇందుకు నిదర్శనమన్నారు. పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణ, జానకిరాములు అరెస్ట్ అయిన విద్యార్థులను పరామర్శించి విడిపించారు.

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కాళోజీ సెంటర్ : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా,శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ వరంగల్ ఆధ్వర్యంలో నేడు (మంగళవారం) ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మహిళా,శిశు,దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ వరంగల్ శాఖ అధికారి రాజమణి ఒక ప్రకటనలో తెలిపారు. కేఎంసీలోని ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో అంతర్జాతీయ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

సఖి అవగాహన కార్యక్రమం

నయీంనగర్: మహిళలు, విద్యార్థులకు ఐదు రకాల సేవలు కౌన్సెలింగ్ సహాయం, వైద్య, పోలీస్, న్యాయ. తాత్కాలిక వసతి మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి వన్ స్టాప్ సెంటర్ అందిస్తుందని అడ్మినిస్ట్రేటర్ హైమవతి, కేస్ వర్కర్ హరిత తెలిపారు. సోమవారం ఆల్ ఫోర్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు సఖీ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వినతిపత్రం అందజేత

కాజీపేట : కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వినీతను సోమవారం షెడ్యూల్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యమడాల అనుకాంత్ మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు దక్కేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

మహాపడిపూజకు రావాలని సీపీకి ఆహ్వానం



హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి రోడ్‌లోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో ఈ నెల 11న బుధవారం జరిగే మహాపడిపూజ కార్యక్రమానికి హాజరు కావాలని సీపీ అంబర్ కిశోర్ ఝాను ఆహ్వానించారు. సోమవారం సీపీ కార్యాలయంలో అయ్యప్ప ఆలయం వ్యవస్థాపకులు గురుస్వామి టీఆర్ బాలసుబ్రమణ్యశర్మ, అర్చకులు గణపతిశర్మ, నరేందర్ గురుస్వామి సీపీని కలిసి స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, ఆహ్వాన పత్రికను అందజేశారు.

పైపులైన్ లీకేజీ గుంతను పూడ్చివేయాలి



కరీమాబాద్ ఉర్సు చెట్లగడ్డ రహదారిపై తవ్వివదిలేసిన పైపులైన్ లీకేజీ గుంతను పరిశీలిస్తున్న రవి

ఖిలా వరంగల్: ప్రధాన రహదారిపై తవ్వి వదిలేసిన పైపులైన్ లీకేజీ గుంతను వెంటనే పూడ్చివేయాలని, తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారు లేరని స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం వరంగల్ ఉర్సు గుట్ట బైపాస్ రోడ్డులో తవ్వివదిలేసిన గుంతలో అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక ప్రజలు అభ్యర్థన మేరకు సోమవారం కార్పొరేటర్ తవ్వివదిలేసిన పైపులైన్ లీకేజీ గుంతను పరిశీలించారు. నగర మేయర్, కమిషనర్ సందర్శించి లీకేజీలను అరికట్టి ప్రమాదకరమైన గుంతను తక్షణమే పూడ్చివేయాలని కోరారు.

అర్బన్ డే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

- బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : రాష్ట్రంలో ప్రజాపాలన ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో మంగళవారం జరిగే అర్బన్ డే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే కోరారు.ఉదయం 7–30 లకు 2కే రన్ వరంగల్ కేఎంసీ నుంచి బల్దియా ప్రధాన కార్యాలయం వరకు ఉంటుందని తెలిపారు. 9 గంటలకు బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో శానిటేషన్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు, సాయంత్రం 6 గంటలకు కాళోజీ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వీధి వ్యాపారులు, ఎస్‌హెచ్‌జీ మహిళా బృందాలకు చెక్కుల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.